## క్లుప్తంగా

### ఉపాధ్యాయుడికి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న వెంకటేశ్వరరాజు

గూడూరు రూరల్ : మండలంలోని విందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కొండూరు వెంకటేశ్వరరాజుకు సహస్ర సేవా సార్వభౌమ పురస్కారం లభించింది. ఆయన రెండు దశాబ్దాలుగా విద్య, సాహిత్య, సేవా రంగాల్లో చేస్తున్న సేవ లను ప్రశంసిస్తూ నంద్యాల జిల్లాకు చెందిన కళా స్రవంతి సాహితీ సాంస్కృతిక సంస్థ అవార్డును ప్రదానం చేసింది. ధ్రువీకరణ పత్రాన్ని శుక్రవారం పాఠశాల హెచ్ఎం వెంకటనాగమల్లికార్జునరావు అందజేశారు.

### మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరి మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అద్దంకి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న కమిషనర్ వెంకటరామయ్య కృష్ణా జిల్లా పెడన మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. అబ్దుల్ రషీద్‌కు కార్యాలయ సిబ్బంది శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

**ఎంపీడీవో..**

గూడూరు రూరల్ : ఎంపీడీవోగా కె.రాజశేఖర్ రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇటీవల కేవీబీపురం నుంచి బదిలీపై వచ్చిన కె.రామచంద్ర బాధ్యతలు చేపట్టారు. కేవీబీపురం, గూడూరు తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఉండడంతో ఆయనను జలదంకికి బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న రాజశేఖర్‌రావును ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో రాజశేఖర్‌రావు ఎంపీపీ బూదూరు గురవయ్యను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

### వైఎస్సార్ సీపీ నేతకు సన్మానం


యస్థాని బాషాను సన్మానిస్తున్న ముస్లింలు

డక్కిలి (బాలాయపల్లి): వెంకటగిరి పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకుడు యస్థాని బాషాకు శుక్రవారం బాలాయపల్లి మండలం ఊట్లపల్లికి చెందిన ముస్లింలు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. జిల్లా కారదర్శి సయ్యద్ ఖాదర్ బాషా, కార్యదర్శి జాఫర్ హుస్సేన్, నాయకులు నూరుల్లా, ఖలీల్, రియాజ్, హుమయూన్, రఫీ, గ్రామ సర్పంచ్ సుధాకర్ బాబు పాల్గొన్నారు.

### గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడి చిద్విలాసం



రాపూరు: మండలంలోని పెంచలకోనలో వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహా స్వామి శుక్రవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం కావడంతో స్వామివారి మూలమూర్తికి చందనంతో అలంకరించారు. ఉదయం 9 గంటలకు కల్యాణ మండపంలో శాంతి హోమం, 11 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

### ఇంట్లో చోరీపై ఫిర్యాదు

కోట : విద్యానగర్ టీటీడీ రోడ్డు సమీపంలో శ్రీనివాసులు ఇంట్లో చోరీ జరిగినట్లు శుక్రవారం పోలీసులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు వెళ్లాడు. తాళాలు వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన విషయాన్ని పక్కనే ఉంటున్న వారు గుర్తించి ఎస్‌ఐ నాగబాబుకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ ఇంటిని పరిశీలించారు. బాధితులు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు.

### బస్సును ఢీకొన్న ఆటో

కోట: మండలంలోని చిట్టేడు వద్దనున్న ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి బస్సును ఆటో ఢీకొంది. ముగ్గురు గాయపడ్డారు. ఆటో ప్రయాణికులతో గూడూరు వైపు వెళుతోంది. చిట్టేడు వద్ద అడ్డుగా వచ్చిన దూడను తప్పించే క్రమంలో ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సును ఢీకొని బోల్తాపడింది. ఆటోలో ఉన్న ఓజిలి గ్రామానికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. వారిని 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య

సూళ్లూరుపేట రూరల్: సూళ్లూరుపేటలోని బాపూజీకాలనీలో శుక్రవారం ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రహీంరెడ్డి కథనం మేరకు.. రాజమండ్రి ప్రాంతానికి చెందిన వి.నాగేశ్వరరావు(58) బాపూజీ కాలనీలో ఉంటూ షార్‌లోని స్త్రైకర్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. బ్యాంక్ రుణంతో పాటు అప్పులు తీర్చేందుకు ఇంటిని రూ.73 లక్షలకు విక్రయించాడు. అడ్వాన్స్‌గా రూ.52 లక్షలు తీసుకున్నాడు. శుక్రవారం రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. బ్యాంకులో ఉన్న రుణం తీరలేదని తేలడంతో రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. దీంతో నాగేశ్వరావు మనస్తాపం చెంది ఇంటికి వచ్చి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడాడు. ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# జగనన్న గెలుపే ధ్యేయంగా శ్రమిద్దాం

- వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి
- వెంకటగిరి రూరల్, డక్కిలి మండలాల పార్టీ శ్రేణులతో సమీక్ష


మాట్లాడుతున్న తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో వెంకటగిరి రూరల్, డక్కిలి మండలాల వైఎస్సార్ సీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రీ చేయలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. ఆయన తీసుకువచ్చిన సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. ఎక్కడా అవినీతికి చోటులేకుండా ప్రజలకు పథకాలు అందజేస్తున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసేలా చూడాలన్నారు. ప్రతి కార్యకర్తా ప్రజల ఇంటి వద్దకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన మంచిని వివరించాలన్నారు. మనస్పర్థలు, అభిప్రాయ భేదాలు ఉంటే సర్దుబాటు చేసుకుని వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రానున్నన్న సార్వత్రిక ఎన్నికల్లో తిరుపతి పార్లమెంట్ పరిధిలోని వెంకటగిరిలో అత్యధిక మెజార్టీ తీసుకువచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటగిరి రూరల్, డక్కిలి మండలాల వైఎస్సార్‌సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

### • ఆశీర్వాదం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులురాజు కుమారుడు సాయిజీవన్ వివాహ రిసెప్షన్ శుక్రవారం చాగణం సమీపంలో ఉన్న ఆర్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఇందులో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు.

### యువకుల రక్తదానం

రాపూరు : స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించినట్లు వైద్యులు నర్మదాదేవి, రేష్మ తెలిపారు. వైద్యశాలలో బ్లడ్ బ్యాంక్ ఉందని, అందులో రక్తం నిల్వ చేసి అవసరమైన వారికి అందజేస్తున్నట్టు తెలిపారు. 15 మంది యువకులు రక్తదానం చేసినట్టు పేర్కొన్నారు. గూడూరు బ్లడ్ బ్యాంక్ వైద్యులు సందీప్, శ్రీనివాస్, వైద్యులు మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు


హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చిల్లకూరు: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపారు. జాతీయ రహదారిలోని బూదనం టోల్ ప్లాజా సమీపంలో సర్వే నంబర్ 953లోని 17.24 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇటీవల కొంతమంది ఆక్రమించుకున్నారు. దీనిపై ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు స్పందించి హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఎవరైనా అక్రమంగా ప్రవేశించి ఆక్రమణలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో కడివేడు రెవిన్యూ పరిధిలోని సర్వేనంబర్ 953లోని ప్రభుత్వ భూముల్లో హెచ్చరికల బోర్డులను వీఆర్‌వో బాలాజీ, వీఆర్‌ఏ శివ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### తమిళ రేషన్ బియ్యం స్వాధీనం

తడ: మండలంలోని అక్కంపేట గ్రామం వద్ద శుక్రవారం తమిళనాడు రేషన్ బియ్యం 702 బస్తాలను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు తిరుపతి విజిలెన్స్ అధికారులు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణ నాయక్, సీఎస్‌డీటీ ఓబయ్య తమ సిబ్బందితో కలిసి అక్కంపేట వద్ద బియ్యం బస్తాలను లారీల్లోకి ఎక్కిస్తుండగా దాడి చేశారు. రెండు పెద్ద లారీలు, మరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్లు వాటంబేడు గ్రామానికి చెందిన ఎం హరనాథ రెడ్డి, రేణిగుంటకు చెందిన కె.చంద్ర, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జి.గోవిందును అదుపులోకి తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యం 53,040 కిలోలను కొండూరు వద్ద ఉన్న సివిల్ సప్లయిస్ గోదాములో భద్ర పరిచారు. బియ్యం అక్రమ రవాణాలో ప్రధాన నిందితుడు సూళ్లూరుపేటకు చెందిన ప్రతాప్‌నాయుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 21 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ గిలక బ్రహ్మయ్య

సూళ్లూరుపేట : పట్టణంలోని గోకులకృష్ణ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బెంగళూరుకు చెందిన కోడినెస్ట్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఇంజినీరింగ్ ఫైనలియర్ చదువుతున్న 65 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 21 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల చైర్మన్ గిలక బ్రహ్మయ్య తెలిపారు. కోడెనెస్ట్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ లీడింగ్ డెవలప్‌మెంట్ మేనేజర్ రిషిరంజన్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ అర్జున్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ముచ్చకాల సురేష్, ఏవో గుర్రం మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

### సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలులో నగదు, బంగారు పట్టివేత

గూడూరు రూరల్ : సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్న ఇద్దరి నుంచి బంగారు, నగదును స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారు శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రైళ్లలో తనిఖీలు చేస్తున్నట్టు తెలిపారు. సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు కనిపించారు. వారిలో ఒకరి వద్ద రశీదులు లేకుండా 200 గ్రాముల బంగారు నగలు, రూ.6.50 లక్షల నగదు గుర్తించారు. మరొకరి బ్యాగులో రూ.8.25 లక్షల నగదును చూశారు. వాటికి సరైన ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ఆదాయపన్ను శాఖకు అప్పగించనున్నపట్లు ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపారు.

## ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

సైదాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిందని ఏవో పురుషోత్తం శివకుమార్, వైఎస్సార్ సీపీ నేత అబ్బిరాజు తెలిపారు. మండలంలోని చాగణం రాజుపాళెం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ పొట్లూరు వెంకటరమణమ్మ అధ్యక్షత వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు 172 రకాల మందులు అందజేస్తున్నట్టు పేర్కొ న్నారు. అలాగే కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుమతి, వైద్యులు డాక్టర్ శ్రావణి, కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

**జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి**

డక్కిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సి.లీలామాధవి తెలిపారు. మండలంలోని వెలికల్లు సచివాలయంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈవోపీఆర్డీ అల్లాబక్షు, సూపరిండెంటెంట్ అనూరాధ, వైద్యాధికారులు బిందు ప్రియాంక, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### సుధాకర్‌కు చిందేపల్లి పరామర్శ



పెళ్లకూరు: వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మారాబత్తిన సుధాకర్‌ను శుక్రవారం ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి, నేత శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి పరామర్శించారు. సుధాకర్ ఇటీవల చెన్నైలో కుడికాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ క్రమంలో మధుసూదన్‌రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి గ్రామానికి చేరుకుని ఆయన ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వరరెడ్డి, రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

## ఈ-క్రాప్ నమోదుపై అభ్యంతరాలు తెలపండి

వెంకటగిరి రూరల్ : మండలంలో రబీ సీజన్‌లో పంటలు సాగుచేసి ఈ- క్రాప్ నమోదు చేసుకున్న రైతుల జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్టు వ్యవసాయశాఖ అధికారిణి సుజాత తెలిపారు. మండలంలో 2023-24 రబీ సీజన్‌లో 2,673 మంది రైతులు 5449 ఎకరాల్లో పంటలు సాగు చేశారని తెలిపారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఆర్బీకేల వద్ద ఆదివారం వరకు నిర్వహించే గ్రామ సభల్లో తెలియజేయాలన్నారు.

**ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి**

వాకాడు : మండలంలోని రైతులు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో దీప తెలిపారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ మండలంలో 13,287 పంటల సాగు చేసినట్టు తెలిపారు. అందులో 10,040 ఎకరాల్లో 2,042 మంది రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకున్నారని తెలిపారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలను ఈ నెల 1 నుంచి 3 వరకు ఆర్బీకేలో ప్రదర్శిస్తామన్నారు. రైతులు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో సరి చేసుకోవాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుంటేనే పంటల బీమా, పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ, పంట రుణాలు వర్తిస్తాయని పేర్కొన్నారు.

**ఆర్బీకేల్లో ఈ-క్రాప్ నమోదు జాబితాలు**

దొరవారిసత్రం : మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న ఆర్బీకేల్లో శుక్రవారం వ్యవసాధికారులు ఈ-క్రాప్ (రబీ సీజన్ 2023-24) నమోదు జాబితాలను ప్రదర్శించారు. ఈ జాబితాలను పరిశీలించుకుని అభ్యంతరాలను ఆదివారం సాయంత్రంలోపు తెలియజేయాలని వ్యవసాధికారిణి జ్యోతిర్మయి తెలిపారు. అభ్యంతరాలపై వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

### 90 శాతం పింఛన్ల పంపిణీ

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట మున్సిపాలిటీలో శుక్రవారం సాయంత్రానికి 90 శాతానికి పైగా పింఛన్లను పంపిణీ చేసినట్లు కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మొత్తం 4,255 మంది లబ్ధిదారులు ఉన్నారని, శుక్రవారం సాయంత్రానికి 3,900 మందికి నగదు అందజేసినట్టు పేర్కొన్నారు. ఎల్ఏ సాగరం సచివాలయం పరిధిలోని సుశీలమ్మ అనే వృద్ధురాలు కాలికి శస్త్ర చికిత్స చేసుకుని మనుబోలులో తమ బంధువుల ఇంటి వద్ద ఉండగా వలంటీర్ సునీత అక్కడికి పింఛను అందజేసినట్టు పేర్కొన్నారు.

**ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ**

సైదాపురం: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వలంటీర్లు ప్రారంభించారు. సర్పంచులు, సచివాలయాల సిబ్బంది ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారుల వేలి ముద్రలు తీసుకుని పింఛను మొత్తం అందజేశారు.


సైదాపురం: పింఛన్‌ను నగదు అందజేస్తున్న చేస్తున్న వలంటీరు

**80 శాతం పింఛన్ల పంపిణీ**

చిల్లకూరు: మండలంలో శుక్రవారం సాయంత్రానికి 80 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్టు ఎంపీడీవో భానుమూర్తి తెలిపారు. మరో రెండు రోజుల్లో మిగిలిన వారికి అందజేసి వంద శాతం పూర్తి చేస్తామన్నారు.

# వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ


మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కు అందజేస్తున్న మేరిగ మురళీధర్

కోట : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో మహిళలు మహారాణులుగా వెలుగొందుతున్నారని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శుక్రవారం పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 686 సంఘాలలోని 6,778 మంది సభ్యులకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.5.38 కోట్లు అందజేసినట్టు తెలిపారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం జగనన్న నెరవేర్చారని పేర్కొన్నారు. చంద్రబాబు తన హయాంలో అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను నిట్టనిలువునా మోసం చేశారని గుర్తు చేశారు. నాటి చంద్రబాబు పాల నకు, నేటి జగనన్న పాలనకు మధ్య తేడాను పరిశీలించాలని కోరారు. ప్రతి ఇంటికీ మంచి జరిగి ఉంటేనే తనకు ఓటు వేయాలని చెప్పే దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు దేశంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ఈ విషయాన్ని అక్కచెల్లెమ్మలు అర్థం చేసుకోవాలన్నారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వారి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించిన సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా మహిళలు ముఖ్యమంత్రి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ దాసరి అంజమ్మ, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ మొబీన్, మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, చేవూరు నాగేశ్వరరావు, నాగూర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**వలంటీర్ల సేవలకు తగిన గుర్తింపు**

వలంటీర్లు అందిస్తున్న సేవలను గుర్తించి ప్రభుత్వం అవార్డులతో సత్కరిస్తోందని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు జగనన్న కుటుంబంలో సభ్యులన్నారు. ఆయన తమపై పెట్టుకున్న ఆశలను వమ్ముచేయకుండా కష్టపడి పనిచేయాలన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో వలంటీర్లు చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. పింఛన్ల పంపిణీతో అవ్వాతాతల మనస్సులను గెలుచుకున్నారని పేర్కొన్నారు. అప్పగించిన బాధ్యతలను ఎంతో క్రమశిక్షణతో నెరవేరుస్తున్న వలంటీర్లను ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ దాసరి అంజమ్మ, సర్పంచ్ వెంకటరమణమ్మ, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ మొబీన్, ప్రసాద్‌గౌడ్, సుధారెడ్డి పాల్గొన్నారు.




సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు, వలంటీర్ లక్ష్మీని సన్మానిస్తున్న మేరిగ మురళీధర్

## ప్రతి పిల్లవాడికీ పోలియో చుక్కలు వేయాలి

సైదాపురం: పల్స్‌పోలియో కార్యక్రమంలో ప్రతి పిల్లవాడికీ పోలియో చుక్కలు వేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ జనార్దన్‌రావు కోరారు. ఆయన శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో పల్స్ పోలియోపై సిబ్బందితో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలు 2,438 మంది ఉన్నారని తెలిపారు. వారికి పోలియో చుక్కలు వేసేందుకు 31 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది ఆదివారం ఉదయమే ఆయా కేంద్రాలకు చేరుకుని పోలియో చుక్కలు వేయాలని సూచించారు.

చిల్లకూరు: మండలంలో ఆదివారం చేపట్టనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో భానుమూర్తి తెలిపారు. ఆయన శుక్రవారం వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్షించారు. ఆయన మట్లాడుతూ మండలంలోని నాలుగు పీహెచ్‌సీల పరిధిలో 5 ఏళ్ల లోపు పిల్లలకు కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. డాక్టర్ ప్రసన్న, సూపర్‌వైజర్ రవి పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు


డక్కిలిలో బోరును పరిశీలిస్తున్న అధికారులు

డక్కిలి: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో లీలా మాధవి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం క్రాస్ ప్రోగ్రాంలో ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల ఎదురుగా ఉన్న బోరును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న చేతి బోర్లు సక్రమంగా పనిచేసేలా చూడాలన్నారు. చెడిపోయిన వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజు మాట్లాడుతూ మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో 622 బోర్లు ఉండగా క్రాస్ ప్రోగ్రాం కింద 520 బోర్లను పరిశీలించామన్నారు. అవసరమైన చోట మరమ్మతులు చేస్తున్నట్టు తెలిపారు. ఈవోపీఆర్డీ అల్లాబక్షు, బోరు మెకానిక్‌లు విమలాకర్, శివ శంకర్ పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో ప్రవేశం కోసం దరఖాస్తులు

తడ/దొరవారిసత్రం/వెంకటగిరి రూరల్ : తడ మండలం అక్కంపేట గ్రామంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్, దొరవారిసత్రం మండలం మావిళ్లపాడు గ్రామంలో ఉన్న మోడల్ స్కూల్, వెంకటగిరి మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాళ్లు కే సౌజన్య, సీహెచ్ సుమలత, ప్రిన్సిపాల్ తుల సిజ్యోతి తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 పరీక్ష రుసుము చెల్లించాలని తెలిపారు. వివరాలను 8919066398, 9490697556, 7032996508, 9160995627, 9502097754లో సంప్రదించాలని సూచించారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం


గూడూరు రూరల్ : పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న ఇంటర్ విద్యార్థులు,


నోటీసు బోర్డులో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థినులు


రాపూరులో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలో శుక్రవారం ఉదయం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటలకే విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. నోటీసు బోర్డు వద్ద తమ హాల్ టికెట్ నంబర్ చూసుకునే క్రమంలో అక్కడ సందడి నెలకొంది. అనంతరం అధికారులు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. పట్టణంలోని ఎస్‌కేఆర్ జూనియర్ కళాశాల, స్వర్ణాంధ్ర భారతి, సెయింట్‌మేరీస్, డీఆర్‌డబ్ల్యూ, నారాయణ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో 1,384 మంది పరీక్షలు రాసినట్టు అధికారులు తెలిపారు.

**రాపూరులో..**

రాపూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ టి.భారతి తెలిపారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కండలేరు గురుకుల పాఠశాల, వినాయక జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు 216 మందికి గాను 204 మంది పరీక్షకు హాజరైనట్లు చెప్పారు. అలాగే ఒకేషనల్ పరీక్షకు 19 మందికి గాను 18 మంది హాజరైనట్లు వివరించారు.

**దొరవారిసత్రంలో..**

దొరవారిసత్రం : మండలంలో శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మావిళ్లపాడులోని ఆదర్శ పాఠశాల, డీవీ సత్రంలోని కేజీబీవీ, బీసీ గురుకుల కళాశాల విద్యార్థులకు డీవీ సత్రంలోని బీసీ గురుకుల పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటుచేశారు. తొలి రోజున 185 మంది విద్యార్థులు హాజరయ్యారు. డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా రమేష్ వ్యవహరించారు. ప్రిన్సిపాల్ తిరుపతయ్య పర్యవేక్షించారు.

**ఇంటర్ పరీక్షలకు 620 మంది హాజరు**

కోట: మండలంలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోట ఎస్సీ గురుకుల కళాశాల, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాల్లో 620 మంది పరీక్షలు రాసినట్టు అధికారులు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

**వాకాడులో..**

వాకాడు: మండలంలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. వాకాడు గురుకుల పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో 341 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 327 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ రామానుజం ఆచార్యులు తెలిపారు. కోట ఎస్సీ, బీసీ గురుకులం, ప్రగతి, విద్యానగర్ ఎన్‌బీకేఆర్, శ్రీనివాస, చిట్టమూరు టీఎంఆర్, మల్లాం సీవీఎస్ఆర్ కళాశాలలకు చెందిన విద్యార్థుల కోసం ఇక్కడ సెంటర్ ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు.

**వెంకటగిరిలో..**

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరిలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. విశ్వోదయ ప్రభుత్వ జూనియర్, ఏపీఆర్‌జేసీ, ఎస్‌బీఎస్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. 1084 మంది విద్యార్థులు హాజరయ్యారు.